క్లుప్తంగా

విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: విద్యుత్ సంస్కరణలో భాగంగా పెంచిన విద్యుత్ చార్జీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణలో భాగంగా వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలోని ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను ఆప్కోస్ నుంచి మినహాయించి పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆప్కోస్ ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి వేతనాలు పెరగకపోగా వేతనాల నుంచి కటింగ్ చేసిన పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఏఐటీయూసీ నాయకులు కెసీ బాదుల్లా, నరసింహులు, తారక రామారావు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వసతి కల్పించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలోని రిమ్స్ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రిమ్స్ పారా మెడికల్‌లో డీయంఎల్‌టీ, డీఎంఐటి, డీఓఏ వంటి వివిధ కోర్సుల్లో వందలాంది మంది విద్యార్థులు రిమ్స్ మెడికల్ కళాశాలలో చదువుకుంటున్నారన్నారు. నగరంలోని ప్రైవేట్ హాస్టల్ రూ. వేలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారా మెడికల్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు శివశంకర్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సిస్టోబాల్ పోటీల్లో ప్రతిభ



మెడల్, ట్రోఫీతో పీడీ వంశీనాయక్

కడప ఎడ్యుకేషన్ : నార్త్ బెంగుళూరులోని డిల్లీ పబ్లిక్ స్కూల్లో మే 21 నుంచి 25వ తేదీ వరకు సిస్టోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , ఏషియన్ సిస్టోబాల్ ఫెడరేషన్, అంతర్జాతీయ సిస్టోబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వంశీనాయక్ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. మొట్ట మొదటి సారిగా నిర్వహించిన ఈ సిస్టోబాల్ ప్రపంచకప్–2023 పోటీల్లో ఇండియా తరపున పీడీ వంశీనాయక్ ఆడి రన్నర్‌గా నిలిచారన్నారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ తదితరులు వంశీనాయక్‌ను అభినందించారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9440905478, 9985606866 నెంబరులో సంప్రదించాలన్నారు.

అంగన్వాడీ సమస్యలపై ఆందోళనలు

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని జులై 10, 11 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపడతామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంగన్వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణాతరగతుల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్లకు నవరత్నాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఆనందంగా విహరిద్దాం!

• నేడు ప్రపంచ పిక్నిక్ దినోత్సవం



పిక్నిక్‌కు వెళుతున్న చిన్నారులు, విద్యార్థులు (ఫైల్)

కడప కల్చరల్ : విహార యాత్రలకు వెళ్లడమంటే అందరికీ సరదాయే. అందులో ప్రకృతి ఒడిలో పరవశింపజేసే వాతావరణంలో రోజంతా గడిపే అవకాశం వస్తే ఎవరూ వదులుకోరు. పలువురు ఇలాంటి వాతావరణాన్ని సృష్టించుకుని మరీ అనందిస్తున్నారు. ఈ ప్రాధాన్యతను గుర్తెరిగిన మేధావులు ఏటా జూన్ 18న అంతర్జాతీయ పిక్నిక్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు. వేగవంతమైన ఆధునిక జీవన శైలిలో అన్ని వర్గాల ప్రజలు మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబంతో కలిసి కొత్త ప్రాంతాలకు పిక్నిక్‌గా వెళ్లి అక్కడి కొత్తదనం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. కుటుంబంతో సినిమాకు వెళ్లాలంటే కనీసం రూ.1500 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆ ఖర్చుతో ఓ కుటుంబం సమీపంలోని పర్యాటక ప్రాంతాన్ని సందర్శించవచ్చని అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు.

నగరంలో..

సాఫ్ట్‌వేర్‌ల సంఖ్య పెరగడంతో డబ్బుకు వెనుకాడకుండా ఉద్యోగులు సామూహికంగా వీకెండ్స్‌లో ప్రత్యేక వాహనాన్ని సమకూర్చుకుని పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. కాలనీ వాసుల్లో ఆత్మీయంగా ఉండే కొన్ని కుటుంబాలు కలిసి వీకెండ్స్‌తో పాటు సెలవు రోజుల్లో తమకు పరిచయం ఉన్న, జిల్లాలో తాము చూడాలనుకుంటున్న ప్రాంతాలకు వెళ్లి సాయంకాలం తిరిగి వస్తున్నారు. ఇలాంటి పరిస్థితి కడపలో ఇటీవల కాలంలో ఎక్కువైంది. పైగా నగరంలోని పాలకొండలు, నగరవనం, దగ్గర్లోని సోమశిల వెనుక జలాలు, గండికోట వంటి ప్రదేశాలు అనువుగా ఉండడం విశేషం. పైగా కొన్ని పర్యాటక సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రెండవ శనివారం, ఆదివారాలు ఇతర సెలవు దినాల్లో కుటుంబాలతో కలిసి ప్రత్యేకంగా మంచి బస్సులను ఏర్పాటు చేసుకుని రోజంతా తమకు నచ్చిన ప్రాంతాన్ని సందర్శించి తృప్తిగా తిరిగి వస్తున్న పర్యాటకుల సంఖ్య పెరిగింది. పైగా అధికారులు కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో ఆయా ప్రాంతాలకు పిక్నిక్‌గా వెళ్లే వారి సంఖ్య పెరగడం విశేషం.

విద్యతో పాటు నైతిక విలువలు ముఖ్యం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

వైవీయూ : విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు ఎంతో ముఖ్యమని చిన్మయామిషన్ అధ్యక్షుడు స్వామి తురియానంద పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ఆదిత్య కల్యాణమండపంలో శ్రీవివేకానంద మహిళాడిగ్రీ కళాశాల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వామీజీ మాట్లాడుతూ ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్న కోరిక క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతోనే సాధ్యమవుతుందన్నారు. సానుకూల దృక్పథం అలవర్చుకుంటే విజయాలు సాధించవచ్చని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ డి.ఎస్.ఆర్. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం బాగుపడాలంటే మహిళలు విద్య, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్లు జి. వాసుదేవరెడ్డి, డా. ఎస్.పి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాట పట్టించాలి



ఈడీ వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి ఆర్టీసీని లాభాల బాటలో పయనింపజేయాలని కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు కోరారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఈడీని శనివారం వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ప్రయాణీకుల నుంచి ఏ ఒక్క ఫిర్యాదు రాకుండా సర్వీసులు నడపాలన్నారు. ఊర్లకు సంబంధించి నేమ్ బోర్డులు తెలుగులోనే ఉండాలని, వీలైనంత వరకు ఆంగ్లం వాడరాదన్నారు. ఇకమీదట ప్రతి అంశం కూడా తమ కార్యాలయం నుంచి తెలుగులోనే ఉంటాయని సూచించారు. సమిష్టి కృషితోనే జోన్‌ను అభివృద్ధి వైపు నడిపించాలని, ఏవైనా సూచనలు, సలహాలు ఉంటే ఏపీఎస్ ఆర్టీసీకి ఉపయోగపడే విధంగా ఉంటే తమకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, జోనల్ కార్యదర్శి రామలక్ష్మణ్‌రావు, జోనల్ అధ్యక్షులు రమణయ్య, జోనల్ లీగల్ సలహాదారుడు అల్లాబకష్, రీజినల్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ రెడ్డిబాష, అన్నమయ్య జిల్లా కార్యదర్శి శరత్‌బాబు, ఉద్యోగులు శ్రీనివాసులు, ఎస్‌కేఎం రెడ్డి, పీఎస్ ఖాన్, బీవీఆర్ రెడ్డి, కొండయ్య, రాజశేఖర్, బీఎస్ రెడ్డి, డిపో కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్ ఆధ్వర్యంలో

నూతన బాధ్యతలు స్వీకరించిన ఈడీ గిడుగు వెంకటేశ్వరరావును కార్మిక పరిషత్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ నాయకులు పీసీ శేఖర్, పురుషోత్తం, నారాయణ, లచ్చన్న, రాజేంద్రారెడ్డి, ఏఆర్ రాముడు, లక్ష్మయ్య, కిశోర్, వెంకటేష్, వలీ పాల్గొన్నారు.

పత్రికా రంగంలో 'తిరుమల'ది ప్రత్యేక ముద్ర



తిరుమల రామచంద్రకు నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం సిబ్బంది

కడప కల్చరల్ : తెలుగు పత్రికా ప్రపంచంలో తిరుమల రామచంద్ర తనదైన శైలితో ప్రత్యేక ముద్ర సాధించారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం తిరుమల రామచంద్ర 111వ జయంతిని నిర్వహించారు. తొలుత బ్రౌన్ కేంద్రం సిబ్బందితో కలిసి తిరుమల రామచంద్ర చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులుగా, సంపాదకులుగా, కవి, నాటక, విమర్శ,భాష అనువాద రంగాలలో తిరుమల రామచంద్ర ఉన్నత స్థాయి ప్రతిభ చూపారన్నారు. గాంధీజీ స్ఫూర్తితో స్వాతంత్ర్య సమరంలో జైలుకు వెళ్లారని, పలు గొప్ప పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారని తెలిపారు. ఆయన రచించిన హంపి నుంచి హరప్పదాక గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించిందన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, బ్రౌన్ గ్రంథ పాలకులు ఎస్.రమేష్‌రావు, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డా. జి. రవీంద్రనాథ్, డా. పి. సుబ్బలక్షుమ్మ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 24వ తేదీలో ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో వివిధ సబ్జెక్టుల కాంబినేషన్‌లతో చక్కటి కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ యేడాది ప్రవేశం పొందేవారికి సింగిల్ సబ్జెక్టు విధానం అమలులోకి రానున్నట్లు తెలిపారు. అర్హత, అనుభవం అధ్యాపకులు కలిగిన కళాశాలల్లో ప్రవేశాల పొందేందుకు కళాశాలల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర కారాగారంలో జడ్జి పర్యటన



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : కడప కేంద్రకారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలను శనివారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జ్ సెక్రటరీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలను ఉద్దేశించి జడ్జి మాట్లాడారు. ఉచిత న్యాయసహాయం, న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థను వివరించారు. పారా లీగల్ వలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధివిధానాలు తెలియజేశారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ కడప వారిని సంప్రదించవచ్చన్నారు. జైలు అధికారులు, సిబ్బంది, ఖైదీలు, మహిళా ఖైదీలు వున్నారు.

ముగిసిన ఆంగ్లమాధ్యమ శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (నోడల్ సెంటర్)లో నిర్వహించిన రెండో విడత ఆంగ్లమాధ్యమ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో అవసరాలకు అనుగుణంగా ఆంగ్లమాధ్యమంలో నైపుణ్యాలు సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. నోడల్ సెంటర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకులను నూతన విద్యావిధానాలకు అనువుగా నైపుణాలను పెంపొందించుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1000 మంది అధ్యాపకులు ఈ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు కృష్ణవేణి, సహదేవరెడ్డి, కృష్ణారెడ్డి, హరి సుధాకర్‌రావు, గురుమోహన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

వల్లూరు: వల్లూరు మండలం గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని రేణుశ్రీ జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైంది. కళాశాలలో ఇంటర్ మీడియట్ సెకండియర్ సిఈసీ గ్రూపులో చదివిన రేణుశ్రీ 896 మార్కులు సాధించింది. ఈ మేరకు కడపలో కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో శనివారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ విజయ రామరాజు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబుతో కలిసి ఆమె రూ 50 వేల నగదు బహుమతిని అందుకుంది.

గోశాలకు ఆవుల తరలింపు

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అలంఖాన్‌పల్లి సమీపంలో ఓ భవనం వెనుక భాగాన ఉంచిన దాదాపు 60 నుంచి 70 ఆవులను పోలీసుల జోక్యంతో బీజేపీ నాయకులు శనివారం వాటిని గోశాలకు తరలించారు. మొదట అక్రమంగా తరలించి ఉంచిన ఆవులను స్థానికులు గుర్తించి పోలీసులకు, బిజెపి నాయకులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి కడప తాలూకా సీఐ ఉలసయ్య, పోలీసు సిబ్బంది హుటాహుటిన చేరుకున్నారు. ఆవులను నిర్బంధించిన వారిపై చర్యలు తీసుకోవాలనీ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

72 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నెల్సన్‌కుమార్

కడప కల్చరల్ : కడప నగరంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక రక్తదాన శిబిరంలో 72 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. స్థానిక పి.రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో ఖూన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదాన ప్రాముఖ్యతను, కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నెల్సన్‌కుమార్ మాట్లాడుతూ కొద్దిపాటి రక్తదానంతో ప్రాణదాతలుగా సమాజంలో గౌరవం సంపాదించవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు మొత్తం 72 మంది కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. ఖూన్ కా రిస్తా సంస్థ చైర్మన్ తారిఖ్ అలీ రక్తదాన శిబిరాలను ఉద్యమంగా నిర్వహిస్తున్న తీరును వివరించారు. కార్యక్రమంలో స్టెప్ కార్యాలయ ప్రతినిధి సుబ్బరాయుడు, కళాశాల ప్రతినిధులు నరసింహా, గౌతమ్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు, రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది డాక్టర్ ప్రవీణ్, టెక్నిషియన్లు నరేష్, హరి, వెంకటరెడ్డి, రమణ, సుబ్రమణ్యం, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

వల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ తో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ అయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఖాదర్ వలీ పేర్కొన్నారు. మండలంలోని తప్పెట్ల గ్రామ సచివాలయ పరిధిలోని చెరువు కిందిపల్లె గ్రామంలో శనివారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, షుగర్ , రక్త పోటు, టీబీ వంటి వ్యాధులు కలిగిన వారికి, మంచాలకే పరిమితమైన వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యాధికారులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను గురించి, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ఆవశ్యకతను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.

భూ సర్వేపై అవగాహన

చెన్నూరు: జగనన్న భూ రక్ష భూ రీ సర్వే ద్వారా మండలంలోని ముండ్లపల్లె గ్రామ పంచాయతీలో శనివారం భూములకు రెవిన్యూ అధికారులు హద్దు రాళ్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ సరస్వతి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇప్పటికే జగనన్న భూ రక్ష భూసర్వే పై రైతులకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలియజేశారు. ముండ్లపల్లె గ్రామంలో 473 మంది రైతులకు సంబంధించిన 812 సర్వే నంబర్లలో గల 884.55 ఎకరాల భూమికి హద్దురాళ్లు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు.

క్రమశిక్షణతో పనిచేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీకి చెందిన విలువైన ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నిబద్ధతత, నిజాయితీగా పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రం ఏపీఎస్ ఆర్టీసీలో కారుణ్య నియామకాల కింద అన్ని దశలలో ఎంపికైన 12 మంది అభ్యర్థులకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ 16 వారాలపాటు స్టయిఫండ్‌తో కూడిన శిక్షణ నిమిత్తం ఒంగోలు నగరంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణలో తెలియజేసిన అంశాలను క్షుణ్ణంగా విని దానిని ఆచరణలో పెట్టాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ పీఎల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ వై. మాధవి, శ్రీరంజన్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలుగా నిలిచిన విద్యార్థులు యశ్వంత్‌కు రూ.3వేలు, ఏ. హేమంత్‌కు రూ.2వేలు, నరసింహ సాయికి వెయ్యి రూపాయలు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై బాగా చదవాలన్నారు. 500లకు పైగా మార్కులు సాధించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాతమ్మ మాట్లాడుతూ పదవ తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగానే భవిష్యత్ ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బాలయ్యగారిపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పెండ్లిమర్రి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని బాలయ్యగారిపల్లె, తిప్పిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని కొత్త గిరియంపల్లె, పాతగిరియంపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుకవస్తే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కొందరు భూ సమస్యలు, విద్యుత్ సమస్యలు, రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి పాల్గొన్నారు.